క్లుప్తంగా

ఆర్చరీ క్రీడాకారిణికి సన్మానం



సన్మానిస్తున్న సర్పంచ్, ఉపసర్పంచ్‌లు

ఎలిగేడు: ఇటీవల గోవాలో జరిగిన జాతీయ క్రీడల్లో మహిళా కాంపౌండ్ ఆర్చరీ వ్యక్తిగత విభాగంలో ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్‌కు చెందిన తానిపర్తి చికిత బంగారు పతకం సాధించింది. ఈ మేరకు గురువారం ఎలిగేడు పంచాయతీ కార్యాలయంలో చికితను సర్పంచ్ భూర్ల సింధూజ, ఉపసర్పంచ్ కోరుకంటి వెంకటేశ్వర్‌రావు శాలువాతో సన్మానించి అభినందించారు. భవిష్యత్‌లో అంతర్జాతీయ స్థాయిలో రాణించి దేశానికి, రాష్ట్రానికి, మండలం, గ్రామానికి గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో భూర్ల వెంకటసత్యం, చింతకుంట మనోహర్‌రావు, అమ్ముల రాములు, న్యాతరి సంపత్, అమ్ముల రమేశ్, అమ్ముల కుమార్, గంధం విక్రమ్, బండ అశోక్, కుదుదుల నరేశ్, కుదుదుల తిరుపతి, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా పడిపూజ



పడిపూజ చేస్తున్న గురుస్వామి

యైటింక్లయిన్‌కాలనీ: శ్రీఅయ్యప్ప స్వామి ఉత్తర నక్షత్ర పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం రాత్రి రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీలోని శ్రీఅయ్యప్పస్వామి ఆలయంలో మహా పడిపూజను కనుల పండువగా నిర్వహించారు. 18వ సారి మాల ధరించి నారికేళ స్వామిగా శబరిమలకు వెళ్తున్న బిక్షపతి స్వామివారి కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ ప్రధాన గురుస్వామి సారంగచారి ఆధ్వర్యంలో పదునెట్టాంబడి మహా పడిపూజ మహోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు భక్తులకు హారతి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, అయ్యప్ప దీక్షాపరులు, భక్తులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ఓదెల: పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని నాంసానిపల్లె, ఓదెల, పొత్కపల్లి గ్రామాల్లో ఎస్సై నూతి శ్రీధర్ ఆధ్వర్యంలో గురువారం వాహనాలను తనిఖీ చేశారు. ఆయా గ్రామాల నుంచి ఎలాంటి అనుమతి లేని పలు వాహనాలకు జరిమానా విధించారు.

సాక్షి ఎఫెక్ట్

మొక్కలు నాటడానికి సిద్ధం



గుంతలు తీస్తున్న కార్మికులు

సుల్తానాబాద్: పట్టణంలోని రాజీవ్ రహదారి మధ్యలో ఉన్న మొక్కలు ఎండిపోయాయి. ఇటీవల 'సాక్షి'లో వార్త ప్రచురితం కావడంతో కాంట్రాక్టర్స్ స్పందించి మొక్కలు నాటడానికి గుంతలు తవ్వారు. మొక్కలు నాటనున్నట్టు కార్మికులు తెలిపారు.

ఓదెల మండలంలో జీరోటిల్లేజ్ మొక్కజొన్న

- 2500ఎకరాల్లో సాగు



ఓదెల: మండలంలో జీరోటిల్లేజ్ సాగు ద్వారా మొక్కజొన్న పంట ఏపుగా పెరిగింది. మండలంలో రైతులు 2500 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశారు. మండలంలో కొలనూర్, కొమిర, జీలకుంట, ఓదెల, గోపరపల్లె, పిట్టల ఎల్లయ్యపల్లె గ్రామాల్లో రైతులు తక్కువ పెట్టుబడితో మొక్కజొన్న పంట సాగు చేస్తున్నారు.

ప్రమాదాలకు కేరాఫ్ ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్

- అంబేడ్కర్ సిగ్నల్ వద్ద తరచూ ప్రమాదాలు
- సెంటర్ వెడల్పు లేకపోవడమే ప్రధాన కారణం



క్రాస్‌రోడ్‌లో ఇష్టారాజ్యంగా వెళుతున్న వాహనాలు

జ్యోతినగర్: ప్రమాదాలకు కేరాఫ్‌గా ఎన్టీపీసీ రామగుండం ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్ అంబేడ్కర్ సెంటర్ రాజీవ్ రహదారి మారింది. నిత్యం వందల వాహనాలు వేగంగా రాకపోకలు సాగించే రాజీవ్ రహదారి ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్డును దాటాలంటే అనుక్షణం భయమే. ట్రాఫిక్ సిగ్నల్స్ ఉన్నప్పటికీ ఈ రోడ్డు మీదుగా వెళుతున్న వాహనాలు ఇష్టారాజ్యంగా వేగంగా వెళ్లడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి.

సర్వీస్ రోడ్డు లేకపోవడంతో..

రామగుండం కార్పొరేషన్‌లోని ఎన్టీపీసీ రామగుండం, ఎఫ్‌సీఐ ఎరువుల కర్మాగారాలకు ముఖ్య కేంద్రంగా ఉండడంతో విధులకు వెళ్లే కాంట్రాక్టు కార్మికులు, దినసరి కూలీలు నిత్యం ఈ రహదారిపై రాకపోకలు కొనసాగిస్తున్నారు. రాజీవ్ రహదారికి కృష్ణానగర్ వైపు సర్వీసు రోడ్డు లేకపోవడంతో అనేక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. సింధూర కళాశాల నుంచి ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్డుకు వచ్చే సర్వీసు రోడ్డు లేకపోవడమే ప్రమాదాలకు ప్రధాన సమస్య.

తరచూ ప్రమాదాలు

క్రాస్‌రోడ్ వద్ద రామగుండం వెళ్లే వైపు గ్రీన్ సిగ్నల్ పడడంతో గోదావరిఖని వైపు నుంచి వెళ్లే వాహనాలు వేగంగా వెళుతున్నాయి. ఎన్టీపీసీ రామగుండం వైపు వెళ్లాలంటే ఏ సిగ్నల్ పడితే వెళ్లాలో వాహనదారులకు అంతుచిక్కని ప్రశ్నగా మారింది. రోడ్డు దాటే వాహనదారులకు తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. చాలా ప్రమాదాలు జరిగి ప్రాణాలతో పాటు వాహనదారులు తీవ్రగాయాలు అయిన సంఘటనలు ఉన్నాయి. రోడ్డు ప్రమాదాలతో ప్రజలు, వాహనదారులు ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్, టీటీఎస్ గేట్, మేడిపల్లి సెంటర్ అంటేనే భయపడిపోతున్నారు. ఈ ప్రాంతం నుంచి రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

సర్వీసురోడ్డు లేకపోవడంతో..



ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్ వద్ద సెంటర్‌ను వెడల్పు చేయాలి. రాజీవ్ రహదారికి ఒకపక్క ఉన్న కృష్ణానగర్ వైపు సర్వీసు రోడ్డు పూర్తిగా లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. సింధూర కాలేజ్ నుంచి ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్‌కు వచ్చే వారు ఏ సిగ్నల్ పడితే రోడ్డుదాటాలో తెలియడం లేదు. సర్వీసురోడ్డు లేకపోవడంతో భారీ వాహనాలు రోడ్డుపక్కనే నిలుపుతున్నారు. పెద్ద వాహనాలు తప్పుకుని రోడ్డుపైకి వస్తే ఎదురుగా వచ్చే వాహనాలు ఢీకొని ప్రమాదాలు జరుగుతున్నాయి. – తిరుపతిరెడ్డి, జంగాలపల్లి

చర్యలు తీసుకోవాలి



ఎన్టీపీసీ కృష్ణానగర్ వైపు సర్వీసు రోడ్డు ఎందుకు నిర్మించడం లేదో పాలకులు ప్రజలకు సమాధానం చెప్పాలి. రామకృష్ణ థియేటర్ రోడ్డుపక్కన ఉన్న పెట్రోల్ బంక్ నుంచి సింధూర కళాశాల క్రాస్‌రోడ్ వరకు సర్వీసు రోడ్డును నిర్మిస్తే ప్రమాదాలు కొంతమేర తగ్గే అవకాశాలు ఉన్నాయి. ఎన్టీపీసీ టెంపరరీ టౌన్‌షిప్ గేట్, ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్ వద్ద రోడ్డు ప్రమాదాలు ఎక్కువ జరుగుతున్నాయి.

– శశి, రామయ్యపల్లి

ఆత్మహత్యకు పాల్పడొద్దు



అవగాహన కల్పిస్తున్న సైకాలజిస్ట్ అశోక్

సుల్తానాబాద్‌రూరల్: జీవితం జీవించడానికే కష్టాలు ఎదురైనప్పుడు ధైర్యంతో ముందుకు సాగాలి కానీ ఆత్మహత్యలకు పాల్పడవద్దని ఆత్మహత్యల నివారణ కమిటీ చైర్మన్, సైకాలజిస్ట్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ అన్నారు. సుల్తానాబాద్ మండలం చిన్నకల్వల గ్రామపంచాయతీ ఆవరణలో గురువారం ఆరోగ్యమిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆత్మహత్య నివారణపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సైకాలజిస్ట్ మాట్లాడుతూ ఆత్మహత్య ప్రయత్నం చేసుకునే వ్యక్తులపై సమాజం స్వాంతన చేకూర్చి మానసికంగా ధైర్యాన్ని నింపాలన్నారు. ఇప్పటి వరకు 28మందిని ఆత్మహత్య నివారణకు కృషి చేయడంపై సంతృప్తి ఉందని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రమేశ్‌గౌడ్, ఆరోగ్యమిత్ర ప్రతినిధి సహజ, ఉపసర్పంచ్ అరుణ, మాజీ సర్పంచ్ నారాయణ, సింగిల్ విండో మాజీ చైర్మన్ ధనంజయ్, కార్యదర్శి సతీశ్ తదితరులు ఉన్నారు.

మక్కాన్‌సింగ్‌ను కలిసిన మారెల్లి



ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌తో నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: కాంగ్రెస్ రామగుండం ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో గెలుపొందిన ఎంఎస్ రాజ్‌ఠాకూర్‌ను పార్టీ జిల్లా వైస్ ప్రెసిడెంట్ మారెల్లి రాజిరెడి కలిశారు. గురువారం హైదరాబాద్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట నాయకులు మార్క రాజు తదితరులు ఉన్నారు.



అధ్వానంగా రహదారి

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని మంగపేట నుంచి అనుబంధ గ్రామం తెనుగుపల్లి ద్వారా జాఫర్‌ఖాన్ పేట వెళ్లే రహదారి గుంతలు పడి అధ్వానంగా మారింది. చిన్న చినుకులు పడినా బరదగా మారి ఈదారి గుండా వ్యవసాయదారులు, విద్యార్థులు, కూలీలు వాహనదారులు ప్రయాణం చేయలేక నానా ఇబ్బందులు పడుతున్నారు. నూతన సర్కార్ ఈ రహదారికి నిధులు మంజూరు చేసి తారురోడ్డు వేసి ఇబ్బందులు తొలగించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ట్రినిటీ కాలేజీలో వర్క్‌షాప్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని ట్రినిటీ ఇంజనీరింగ్ కాలేజీలో ఇన్‌స్టిట్యూట్ ఇన్నోవేషన్ సెల్ ఆధ్వర్యంలో గురువారం లింక్డ్ ఇన్ సర్వీసెస్‌పై ఒక్కరోజు వర్క్‌షాప్ జరిగింది. సంస్థ ప్రతినిధి రోహిత్ కుమార్ వర్క్‌షాప్‌నకు హాజరైన విద్యార్థులకు అవగాహన కల్పించారు. కాలేజీ అకడమిక్ డైరెక్టర్ అశోక్ కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ మణిగణేషన్ తదితరులు హాజరయ్యారు. లింక్డ్ ఇన్ ప్రీమియం సబ్‌స్క్రిప్షన్ యాక్టివేషన్‌పై అవగాహన కల్పించారు. 25వేలకు పైగా కొత్త టెక్నాలజీ కోర్సులు నేర్చుకునేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రస్తుత కాలంలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, డాటా అనలటిక్స్, డాటా సైన్స్, పైథాన్, జావా లాంటి మరెన్నో కోర్సులు ఉచితంగా విద్యార్థులు నేర్చుకోవచ్చని వివరించారు. విద్యార్థులు సులువుగా ఉద్యోగ అవకాశాలు పొందేందుకు దోహదపడతాయన్నారు. కాలేజీ ప్రతినిధులు సురేశ్, రాజిరెడ్డి, టాస్క్ కోఆర్డినేటర్ డాక్టర్ కౌశల్య, మధు శేఖర్, స్వాతి పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలో లయన్స్ విజన్ సెంటర్ ఆధ్వర్యంలో ప్రతి గురువారం ఉచిత కంటివైద్యశిబిరం నిర్వహిస్తున్నామని ఆప్తమాలజిస్టులు వాసే, దత్తగౌడ్ తెలిపారు. అత్యాధునిక పరికరాలతో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచిత కంటి శస్త్ర చికిత్సలు రేకుర్తి కంటి ఆసుపత్రిలో చేయిస్తున్నామని పేర్కొన్నారు. జిల్లాలోని వివిధ గ్రామాలకు చెందిన 478 మందికి ఉచిత కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించామని పేర్కొన్నారు. అవకాశాన్ని పెద్దపల్లి జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

శానిటేషన్‌పై శ్రద్ధ చూపాలి

పెగడపల్లి: శానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంపీవో మహేందర్ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. వెంగళాయిపేట, నంచర్ల, పెగడపల్లి గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. మురుగు కాలువలు, వన నర్సరీలు, వైకుంఠధామాలను పరిశీలించారు. వాటి నిర్వహణపై ఆరా తీశారు. పచ్చదనం, పరిశుభ్రతతో పాటు ఇంకుడు గుంతల నిర్మాణాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు కిరణ్, ప్రవీణ్ ఉన్నారు.

హైదరాబాద్‌కు తరలిన కాంగ్రెస్ శ్రేణులు



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయకులు



సుల్తానాబాద్: తరలి వెళ్తున్న కాంగ్రెస్ కౌన్సిలర్లు

ఓదెల: హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి సీఎం ప్రమాణ స్వీకారోత్సవానికి మండలంలోని కాంగ్రెస్ నాయకులు గురువారం తరలివెళ్లారు. హైదరాబాద్‌లో పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావుకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గొర్లపెంపకందార్ల ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు తమ్మెడబోయిన ఓదెలుయాదవ్, పెద్దపల్లి మార్కెట్ మాజీ చైర్మన్ గుండేటి ఐలయ్యయాదవ్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బైరి రవిగౌడ్, జిల్లా నాయకులు చింతిరెడ్డి విజేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రమాణ స్వీకారానికి తరలిన నేతలు

సుల్తానాబాద్: హైదరాబాద్‌లో నిర్వహించిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారానికి పట్టణంలోని కౌన్సిలర్లు తరలివెళ్లారు. కౌన్సిలర్లు దున్నపోతుల రాజయ్య, చింతల రాజు, ఎండీ రఫీక్ ఉన్నారు.

ప్రభుత్వ ఆఫీస్ చుట్టూ పచ్చదనం



ఓదెల: ఓదెల ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కశ్మీర్ అందాలను పచ్చనిచెట్లు మరిపిస్తున్నాయి. ఓదెల ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ వచ్చే ప్రజలకు ఏపుగా పెరిగిన పచ్చనిచెట్లు ఆహ్లాదాన్నిస్తున్నాయి. ఎస్సారెస్పీ అధికారులు 30ఏళ్ల క్రితం నాటిన మొక్కలు ప్రస్తుతం వృక్షాలుగా మారి నీడనివ్వడంతో పాటు ఆకట్టుకునే విధంగా చెట్లు ఉండటంతో చుట్టుపక్కల వాళ్లు సైతం సేదతీరుతున్నారు.

నేడు ఆలయంలో ఏకాదశి పూజలు



శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ ఫర్టిలైజర్‌సిటీ టౌన్‌షిప్‌లోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో అభిషేకం నిర్వహించనున్నట్లు ఫర్టిలైజర్ సిటీ ఆలయ కమిటీ ప్రకటనలో తెలిపింది. కార్తీకమాసం బహుళ ఏకాదశిని పురస్కరించుకొని శుక్రవారం 108 లీటర్ల పాలతో అభిషేకం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని ఆలయ అర్చకులు పవన్ కుమార్ ఆచార్యులు అన్నారు.

ఏఐటీయూసీతోనే హక్కులు సాధ్యం



మాట్లాడుతున్న రాజ్‌కుమార్

రామగిరి(మంథని): ఏఐటీయూసీతోనే సింగరేణి కార్మికుల హక్కులు సాధ్యమని, కార్మికులందరూ ఏఐటీయూసీకి మద్దతు తెలుపాలని జనరల్ సెక్రెటరీ కోరిమి రాజ్‌కుమార్ అన్నారు. గురువారం ఆర్జీ–3 పరిధి ఏపీఏ గనిలో ఫిట్ సెక్రెటరీ గంగాధర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. సింగరేణి యాజమాన్యంతో టీబీజీకేఎస్ కుమ్మక్కై లాభాల్లో ఉన్న సంస్థను రాష్ట్ర ప్రభుత్వానికి ధారాదత్తం చేసి కార్మికులకు అన్యాయం చేసిందన్నారు. జనరల్ మజ్దూర్‌లను ఓసీపీలకు పంపిచాలన్న, ఏపీఏ కార్మికులకు ప్రాజెక్టు అలవెన్స్ ఇప్పించాలన్న ఏఐటీయూసీ గెలుపుతోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. హక్కుల సాధనకు, సంస్థ భవిష్యత్తు కోసం కార్మికులు ఏఐటీయూసీని గెలిపించుకోవాల్సిన అవసరముందన్నారు. డిప్యూటీ జనరల్ సెక్రెటరీ వై.వి.రావు, సెంట్రల్ సెక్రెటరీలు జూపాక రాంచందర్, ప్రకాశ్, ఆర్జీ–3 బ్రాంచ్ సెక్రెటరీ ఎంఆర్‌సీ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ సమ్మయ్య, రవికుమార్, కిరణ్‌కుమార్, రాజేశ్, కుమారస్వామి, అలీ, తిరుపతి, సలీం, సురేశ్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి కరాటే పోటీలకు ఎంపిక



విద్యార్థులను సన్మానిస్తున్న సతీశ్‌కుమార్

జ్యోతినగర్(రామగుండం): నల్గొండ జిల్లాలోని అంబేద్కర్ స్టేడియంలో ఈనెల 4,5,6వ తేదీల్లో జరిగిన ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో స్థానిక విద్యార్థులు సత్తాచాటారు. గోదావరిఖనికి చెందిన ముక్తిశ్రీ, రామగుండంకు చెందిన వైష్ణవి, ఎన్టీపీసీ రామగుండంకు చెందిన శ్రీవల్లి, హర్షవర్దన్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 16 నుంచి 19 వరకు న్యూఢిల్లీలో జరిగే పోటీల్లో పాల్గొననున్నారు. ఈసందర్భంగా విద్యార్థులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సలీంబేగ్, సతీశ్‌కుమార్, నవోదయ హైస్కూల్ ప్రిన్సిపాల్ తిరుపతిగౌడ్, మధుకర్, మాస్టర్ వొడ్డెపల్లి సురేశ్, కరాటే కోచ్ శ్రీనివాస్, మంథని నాగరాజు, మేనేజర్ శంకర్, బోయపోతు రాము, ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణకాలనీ భవాని యూత్ అధ్యక్షుడు నల్లి నరేశ్ తదితరులు పాల్గొన్నారు.



రూ.లక్షల మిషన్ లక్షణంగా వదిలేశారు

జూలపల్లి: మహిళా గ్రూపుల్లో సభ్యులు తమకు అవసరమైన వరి విత్తనాలు తయారు చేసుకునేందుకు అధికారులు వెలుగు సమాఖ్యకు రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన మిషన్ ఇచ్చారు. అయితే దాన్ని పట్టించుకోకపోవడంతో తుప్పు పట్టి శిథిలావస్థకు చేరింది. మహిళా సంఘాల్లో ఉన్న సభ్యుల కుటుంబాలు వ్యవసాయంలో పెట్టుబడి తగ్గించుకునేందుకు తామే విత్తనాలు ఉత్పత్తి చేయాలన్న లక్ష్యం నేరవేరలేదు. ఇప్పటికైనా మిషన్ బాగుచేయించి వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

కాంగ్రెస్ నాయకుల సంబరాలు



పెద్దపల్లిరూరల్: జెండా కూడలిలో..



యైటింక్లయిన్‌కాలనీ: కాలనీ నాయకులు



ఎలిగేడులో సంబరాలు



రామగిరి: తెలంగాణ చౌరస్తాలో..

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని జెండా కూడలిలో బాణ సంచా కాల్చి.. మిఠాయిలు పంచి పెట్టారు. పెద్దపల్లి ఎమ్మెల్యేగా విజయరమణారావును గెలిపించిన ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

యైటింక్లయిన్‌కాలనీ: కాలనీ కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేశ్, నాయకులు పాల్గొన్నారు.

రామగిరి: మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా గురువారం సెంటినరీకాలనీలో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు నిర్వహించారు. మాజీ ఎంపీపీ కొరుకొప్పుల నీరజ, మాజీ జెడ్పీటీసీ గంట వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

ముత్తారం: రాష్ట్ర మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన దుద్దిళ్ల శ్రీధర్‌బాబును గురువారం హైదారాబాద్‌లో మండల కాంగ్రెస్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు దొడ్ల బాలాజీ, మాజీ జెడ్పీటీసీ నాగినేని జగన్మోహన్‌రావు, అడవి శ్రీరాంపూర్ ఎంపీటీసీ దొడ్ల గీతరాణి, సర్పంచ్‌లు మేడగోని సతీశ్‌గౌడ్, పర్శ లక్ష్మి ఉన్నారు.

ధర్మారం: మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరిపారు. మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ పాలకుర్తి రాజేశంగౌడ్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు కాంపెల్లి రాజేశం, మాజీ ఉపసర్పంచు శంకరయ్య పాల్గొన్నారు.

ఎలిగేడు: మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో అంబేద్కర్ విగ్రహం ఎదుట కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు.

జూలపల్లి: మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు సంబరాలు చేశారు.